నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 26 ఏప్రిల్ 2025 | HYDERABAD

చాలీచాలనీ నీళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ..నిజాంపేట రాజీవ్ గృహకల్ప కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. మూడు రోజులకు ఒకసారి, ఐదు రోజులకు ఒకసారి ఒక డ్రమ్ము నీళ్లు సరఫరా అవుతున్నాయంటూ.. వాపోయారు. – దుండిగల్, ఏప్రిల్ 25

రజతోత్సవం సందర్భంగా పూరీ తీరాన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రంతో పాటు పార్టీ విజయాలను తెలియజేస్తూ శేరిలింగంపల్లి నేత రవీందర్ యాదవ్ ఏర్పాటు చేసిన సైకత శిల్పం

గులాబీ దండు సిద్ధం

ఎల్కతుర్తి సభకు బీఆర్ఎస్ శ్రేణుల సమాయత్తం

- సన్నాహక సమావేశాలతో జోష్ మీదన్న శ్రేణులు
- వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలతో గ్రేటర్ గులాబీమయం
- హోరెత్తిస్తున్న పాటలు.. కేసీఆర్ ప్రసంగంపై జనం ఆసక్తి

కొండాపూర్ మనీదు బండలో రజతోత్సవం సందర్భంగా గులాబీ రంగులో సిద్ధమైన కార్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆదివారం ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు గ్రేటర్ గులాబీ శ్రేణులు సిద్ధమయ్యారు. ఈ వేడుకను పండుగ వాతావరణంలో జరుపుకొనేలా భారీ ఎత్తున ప్లాన్ చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గ సమావేశాలు, తెలంగాణ భవన్ వేదికగా జరిగిన మీటింగ్‌లో నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు కలిసి సన్నాహక సమావేశాలతో కార్యకర్తల్లో జోష్ నింపారు. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపు 4వేల మంది సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. కాగా, పార్టీ అధినేత, కేసీఆర్ ప్రసంగంపై జనం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

పోస్టర్లు, ఫ్లెక్సీల హోరు



భారీ బహిరంగ సభకు గ్రేటర్ శ్రేణులు కదులుతున్నారు. ఇప్పటికే చాలా మంది నేతలు ఎల్కతుర్తి సభ ఏర్పాట్లను పరిశీలించి వచ్చారు. నియోజకవర్గాలను గులాబీ మయం చేయడంతో పాటు పెద్ద ఎత్తున వాల్ పెయింటింగ్ రాయించారు. పలు ప్రాంతాల్లో పోస్టర్లు అంటించారు. ఎక్కడ చూసినా 'కేసీఆర్ జిందాబాద్' 'కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి' 'చలో వరంగల్' 25 ఏండ్ల పండుగను జయప్రదం చేయండి అన్న కొటేషన్లు దర్శనమిస్తున్నాయి.మరోవైపు పార్టీ ఆవిర్భావ సభ వరంగల్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా కవులు, కళాకారులు రాసి పాడిన పాటలు నగరమంతా హోరెత్తిస్తున్నాయి.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రూ 1,00116ల చెక్కును అందజేస్తున్న మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నేత రాయల కార్తిక్

చరిత్రలో నిలిచిపోయేలా సభ

చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ జరగనున్నది. ఈ సభలో తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ఒక మంచి మెసేజ్ ఇవ్వనున్నది. ఇప్పటికే ఎక్కడ చూసినా బీఆర్ఎస్ సభపైనే చర్చ జరుగుతున్నది. ఈ సభతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపనున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు.

– మాగంటి గోపీనాథ్, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు

స్వరాష్ట్రంలో కేసీఆర్ పదేండ్ల అద్భుతమైన పాలనను అందించారు. మొన్నటి వరకు సుభిక్షంగా ఉన్న తెలంగాణ నేడు ఆగమైపోతున్నది. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు. తెలంగాణ కోసం ఎలాంటి ఉద్యమమైతే చేశామో..అదే ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

– ఆవుల రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్

కేసీఆరే శ్రీరామ రక్ష

పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి తర్వాత ఈ 16 నెలల కాంగ్రెస్ పాలనలో మళ్లీ పదేండ్లు వెనకబడి పోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్ష అని ప్రజలు భావిస్తున్నారు. రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులతో పాటు అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు

.– ఎర్రబెల్లి సతీష్‌రావు , బీఆర్ఎస్ నేత

27న చరిత్రాత్మక సభ: ఎమ్మెల్యే తలసాని

సిటీబ్యూరో: ఎల్కతుర్తిలో 27న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చరిత్రాత్మక సభ జరగబోతున్నదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నేతలతో నియోజకవర్గాల వారీగా ఏర్పాట్లపై తలసాని సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభి వాణీదేవి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కేపీ వివేకానంద్, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. చలో వరంగల్ పోస్టర్‌ను తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ అనేక మోసపూరితమైన హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజల ఆగ్రహానికి గురవుతున్నదని తలసాని విమర్శించారు. తిరిగి కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.

'మాదారం ఇండస్ట్రియల్' పనులెప్పుడో..?

మేడ్చల్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా మాదారంలోని ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు పనులు ప్రారంభంలో జాప్యంపై విమర్శలు వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాదారంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 3 వందల ఎకరాలను రూ. 60 కోట్లు వెచ్చించి భూ సేకరణ చేసి టీఎస్ఐఐసీకి అప్పటి ప్రభుత్వం అప్పగించింది. అయితే ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్‌కు సంబంధించిన పనులను ప్రారంభించడం లేదు. టీఎస్ఐఐసీకి భూమిని అప్పగించడంతో నామమాత్రంగా 255 పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు లే అవుట్ మ్యాప్‌ను తయారు చేశారే తప్ప.. తప్ప ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎలాంటి పనులు ప్రారంభించడం లేదు. మాదారంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటైతే సుమారు 255 చిన్న, మధ్య, భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీంతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. టీఎస్ఐఐసీకి భూములు అప్పగించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులు ప్రారంభించడం లేదు. ఇప్పటికే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అనేకంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు వేలాది సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

ఖరీదైన బాటిళ్లలో చీప్ లిక్కర్

II లో

- ట్రూప్స్ బార్ అండ్ రెస్టారెంట్‌లో కల్తీ దందా
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఆబ్కారీ అధికారులు
- నిర్వాహకులపై కేసు నమోదు..షోకాజ్ నోటీసులు
- 1.48 లక్షల విలువైన 75 కల్తీ మద్యం బాటిళ్లు సీజ్
- బార్ లైసెన్స్ సైతం రెన్యువల్ చేయించుకోని వైనం
- 'ట్రూప్స్ బార్' యూత్ కాంగ్రెస్ నేతదిగా ప్రచారం

నగరంలో పాకిస్థానీయులు

- సిటీలో కట్టుదిట్టమైన పోలీసు భద్రత
- పాకిస్థానీయుల వివరాలపై కేంద్రం ఆరా
- వెనక్కి పంపాలంటూ హోం మంత్రి అమిత్‌షా ఆదేశాలు
- సిటీలో పోలీసుల స్పెషల్ వెరిఫికేషన్ డ్రైవ్
- గడువు ముగిసిన తర్వాత ఉంటే కఠిన చర్యలు

II లో

ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కేటాయించే వరకు పోరాడుతామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద మూడో రోజు చెట్టు కిందనే కూర్చుని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడంతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.క్యాంపు కార్యాలయం లేకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి వినూత్నంగా నిరసన తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. – మల్కాజిగిరి, ఏప్రిల్ 25

పేదల ఇండ్లపై బుల్డోజర్

కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన జవహర్‌నగర్ ప్రజలు

తమ ఇల్లు కూలిస్తే చస్తామంటూ.. కిరోసిన్ పోసుకున్న ఓ కుటుంబం

జవహర్‌నగర్, ఏప్రిల్ 25: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది పలు కాలనీల్లో అక్రమ నిర్మాణం పేరిట చేపట్టిన పేదల ఇండ్ల కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీసింది. పేదల ఇండ్లపైకి బుల్డోజర్ తీసుకురావడంపై జవహర్‌నగర్ ప్రజలు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు. చాకలి ఐలమ్మ కాలనీవాసులు అధికారులపై తిరగబడ్డారు. 30 ఏండ్ల నాటి కాలనీలోకి రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలంటూ రావడం విడ్డురంగా ఉన్నదని కట్టడాలను కూల్చవద్దంటూ అడ్డుకున్నారు. ప్రభుత్వానికి ఇంటి పన్ను, కరెంటు, నల్లా బిల్లులు ఏండ్ల నుంచి చెల్లిస్తున్నాం... చాకలి వృతి చేసుకుని బతికేటోళ్లం.. మా కాలనీలోకి వచ్చి ఇండ్లను కూల్చివేస్తామంటే ఊరుకోమన్నారు. అయినా కనికరం చూపకుండా రెవెన్యూ సిబ్బంది పోలీసు పహారా మధ్య ఇండ్లను కూల్చివేశారు. కాగా, 'మాకు ఈ చిన్నపాటి రేకుల ఇల్లే జీవనాధారం... కూలి పని చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. మా ఇంటిని కూల్చొదం'టూ ఓ కుటుంబం ఇంట్లోకి వెళ్లి గడియపెట్టుకొని కిరోసిన్ పోసుకొని..చస్తామంటూ.. హెచ్చరించింది. రెవెన్యూ అధికారులు బయటకి వెళ్లాలని హుకుం జారీ చేశారు. పోలీసులతో ఇంటి తలుపులు బద్దలు కొట్టాలని ప్రయత్నించారు. 'మేమే ఇంట్లోనే చస్తామం'టూ.. ఆ కుటుంబం భిష్మించుకుని ఇంట్లోనే ఉంటూ.. దండాలు పెట్టుకుంటూ కూల్చొదంటూ బోరున విలపించారు.

నీడ లేకుండా చేయడం దుర్మార్గం

25 ఏండ్ల నాటి 40 గజాల రేకుల ఇంటిలో జీవనం సాగిస్తున్నాం. పనికి వెళ్తేనే పూటగడిచే దుస్థితిలో కాలం వెళ్లదీస్తున్నాం. వర్షానికి రేకుల పగిలిపోతే... కొత్తగా నిర్మించుకుందామని నిర్మాణం చేపడితే రెవెన్యూ అధికారులు అక్రమమంటూ కూల్చివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులను ఉసిగొల్పుతూ పేదలకు నిల్వ నీడ లేకుండా చేయడం దుర్మార్గం.

– నిడిగొండ రమాదేవి, చాకలి ఐలమ్మ కాలనీ జవహర్‌నగర్